నిండు సభలో కాంగ్రెస్ హ్యాండ్సప్

మొదటిపేజీ తరువాయి...

ఉంచిన పుస్తకానికి 'అవాస్తవాలు' అని పేరు పెడితే సరిగ్గా ఉండేదని అన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం చెప్పిన అబద్ధాలకు, అవాస్తవాలకు తనదైన శైలిలో సమాధానం చెప్పారు.

అవాస్తవం 1: కేంద్ర జల్‌శక్తి అధ్యక్షతన 6-10-2020న జరిగిన రెండో అపెక్స్ కమిటీలో గత ప్రభుత్వం, సీఎం కేసీఆర్ ప్రాజెక్టుల అప్పగింతపై ఒప్పుకొన్నారు.

వాస్తవం: కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన మీటింగ్ మినిట్స్ ప్రకారం నీళ్ల వాటా లెక్క తేల్చే వరకు కేఆర్‌ఎంబీ పరిధిని నిర్ణయించే ప్రశ్నే ఉత్పన్నం కాదని, ట్రిబ్యునల్ అంశం సుప్రీంకోర్టులో ఉన్నదని పేర్కొన్నారు.

అవాస్తవం 2: కేంద్ర ప్రభుత్వం కేఆర్ఎంబీ నోటిఫికేషన్‌ను గత ప్రభుత్వం సవాల్ చేయలేదు. ఫలితంగా ఈ నోటిఫికేషన్ అమల్లోకి వచ్చింది. ఈ నోటిఫికేషన్‌కు అనుగుణంగా కృష్ణా ప్రాజెక్టులను అప్పగించేందుకు అప్పటి ప్రభుత్వం మొగ్గు చూపి చర్యలు తీసుకొన్నది.

వాస్తవం: ఇది తప్పు అనడానికి ప్రస్తుత ఇరిగేషన్ కార్యదర్శి రాహుల్ బొజ్జా రాసిన లేఖనే సాక్ష్యం. కేఆర్ఎంబీ 17వ సమావేశం మినిట్స్ ప్రకారం కేఆర్ఎంబీ విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను రివ్యూ చేయాలని, దీనిపై నిర్ణయం తీసుకొనే అధికారం లేదని, దీన్ని అపెక్స్ కమిటీకి రెఫర్ చేయాలని మినిట్స్‌లో స్పష్టం చేశారు. అలాగే, కార్యదర్శి రాహుల్ బొజ్జా 27-01-2024 రాసిన లేఖలో అప్పటి ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్‌లో మార్పులు చేయాలని 15-07-2021న లేఖ రాసినట్టు తెలిపారు.

అవాస్తవం 3: 6-05-2022న జరిగిన 16వ కేఆర్ఎంబీ సమావేశంలో ప్రాజెక్టులను అప్పగించేందుకు నీటి నిర్వహణ నియమావళిని ఖరారు చేసి ఉత్తర్వులు జారీ చేస్తామని ఒప్పుకొన్నారు.

వాస్తవం: ఇది కూడా అసత్యం అనడానికి రాహుల్ బొజ్జా రాసిన లేఖనే సాక్ష్యం. 16వ కేఆర్ఎంబీ సమావేశంలో అపరేషన్ ప్రొటోకాల్ ఖరారు కాకుండా ప్రాజెక్టుల అప్పగింతకు ఒప్పుకోబోమని అప్పటి ప్రభుత్వం చెప్పిన విషయాన్ని ఆయన తన లేఖలో పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకోబోమని ప్రభుత్వం తేల్చి చెప్పింది. దీన్ని అపెక్స్ కౌన్సిల్‌కు రెఫర్ చేయాలని 17వ కేఆర్ఎంబీ సమావేశంలో స్పష్టం చేసిందని రాహుల్ బొజ్జా కేంద్రానికి రాసిన లేఖలో స్పష్టంగా పేర్కొన్నారు.

అవాస్తవం 4: తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి కృష్ణా నదీ జలాలను, ప్రాజెక్టులను ఏనాడు పట్టించుకోలేదు. ఉమ్మడి ప్రాజెక్టులను అప్పగించేందుకు విభజన చట్టంలో ఉన్న నిబంధనలను ఒక్కనాడు కూడా వ్యతిరేకించలేదు.

వాస్తవం: రెండో అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో సీఎం కేసీఆర్ ఆ నిబంధనలను వ్యతిరేకిస్తున్నట్టు చెప్పినట్టుగా సమావేశం మినిట్స్ ఉన్నాయి. నీటి వాటాల పంపకంలో 50:50 నిష్పత్తిలో నీటిని కేటాయించాలని ఇప్పటి వరకు 27 లేఖలు రాశాం.

హరీశ్‌రావు వర్సెస్ ఉత్తమ్

కృష్ణా ప్రాజెక్టులపై చర్చ మాజీ మంత్రి హరీశ్‌రావు వర్సెస్ మంత్రి ఉత్తమ్ అన్నట్టుగా సాగింది. ఈ ఇద్దరి మధ్య తీవ్ర సంవాదం జరిగింది. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో తప్పుడు అంశాలు చెప్పినట్టు హరీశ్‌రావు ఆరోపించారు. అదే విధంగా వాస్తవాల పేరుతో వేసిన పుస్తకంలోనూ అన్నీ అవాస్తవాలనే పొందుపరిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఉత్తమ్ ప్రశ్నలకు దీటైన సమాధానాలతో హరీశ్‌రావు కుండబద్దలు కొట్టారు.

హరీశ్‌రావు: కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత 17-01-2024న ఢిల్లీలో కేంద్ర జల వనరుల కార్యదర్శి వద్ద సమావేశం జరిగింది. ఇందులో ప్రాజెక్టులను అప్పగిస్తున్నట్టు ప్రభుత్వం స్పష్టంగా ఒప్పుకొన్నది. ఈ సమావేశంలో ప్రాజెక్టులను అప్పగించేందుకు అవసరమైన ప్రణాళికతో 7 రోజుల్లో వస్తాం. అదే విధంగా నెల రోజుల్లో ఈ ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగిస్తాం. సాగర్ డ్యాం వద్దకు వెళ్లాలంటే కేఆర్ఎంబీ అనుమతి కావాలి. బోర్డుకు రాష్ట్రాలు డబ్బులు ఇస్తాయి. వీటన్నింటికీ ఒప్పుకొన్నది కాంగ్రెస్ ప్రభుత్వమే.

ఉత్తమ్: దీనిపై మా ప్రభుత్వం సంతకం చేయలేదు. మా ప్రభుత్వం తరుపున కార్యదర్శి కూడా సంతకం చేయలేదు. ఎక్కడి నుంచో డాక్యుమెంట్ తీసుకొచ్చి చెబితే ఎలా.

హరీశ్‌రావు: బాధ్యతగల మంత్రి పదవిలో ఉంటూ కేంద్రం ఇచ్చిన మినిట్స్‌ను ఎక్కడి నుంచో తీసుకొచ్చారనడం బాగాలేదు.

ఉత్తమ్: కృష్ణా జలాల్లో తెలంగాణ, ఏపీ వాటాను 299:512 టీఎంసీలుగా 2015 నుంచి 2022 వరకు ఒప్పుకొని ఇప్పుడు రాజకీయంగా 50:50 అడుగుతున్నరు. అంతకు ముందు 50:50 నిష్పత్తి ఎందుకు అడగలేదు. వాస్తవంగా రావాల్సిన 68:32 ఎందుకు అడగడం లేదు.

హరీశ్‌రావు: మా ప్రభుత్వం నిరుడు మాత్రమే 50:50 నిష్పత్తిలో వాటా అడిగిందని మంత్రి ఉత్తమ్ చెప్తున్నారు. ఇలాంటి అబద్ధాలతో మాపై బురద జల్లాలని సిద్ధమై వచ్చి నట్టున్నారు. కానీ బురద చల్లించుకునేందుకు మేం సిద్ధంగా లేం. బయటకు వెళ్లడానికి సిద్ధంగా లేం. ప్రతి దానికి సమాధానం చెప్తాం. 07-07-2018న అప్పటి సీఎస్ ఎస్‌కే జోషి 50:50 కావాలని గత కేంద్రానికి లేఖ రాశారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ గుర్తించాలి.

వారం వరకు ఎందుకు లేఖ రాయలేదు?

ప్రభుత్వం కృష్ణా ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించినట్టు కేఆర్ఎంబీ సమావేశమైన మరుసటి రోజు అంటే 18వ తేదీన అన్ని వార్తా పేపర్లలో దీని వల్ల జరిగే నష్టంపై పతాక శీర్షికలతో వార్తలు వచ్చాయి. ఇలాంటి పరిస్థితుల్లో బాధ్యతాయుతమైన ప్రభుత్వం అయితే ఆ వార్తల్ని ఖండించాలి కదా? ఎందుకు ఖండించలేదు. 19వ తేదీన నేను విలేకరుల సమావేశం నిర్వహించి ఓపెపు కేంద్రం ప్రాజెక్టులను తీసుకుంటుంటే ఈ ప్రభుత్వం నిద్రపోతున్నదా? అని ప్రశ్నించా. తాము కేంద్రానికి లేఖ రాశామని మంత్రి ఉత్తమ్ చెప్పారు. సమావేశం పూర్తై నిర్ణయం తీసుకొన్న 10 రోజులు తర్వాత లేఖ రాశారు. అది కూడా మా పార్టీ లొల్లిపెట్టి.. కేసీఆర్ ఈ అంశంపై సమావేశం ఏర్పాటు చేసి నల్లగొండ సభ నిర్ణయించిన తర్వాత జనవరి 27న ఈ ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసింది. సమావేశం మినిట్స్ వెలువడిన 10 రోజుల వరకు నిద్రపోతున్నారా? ఒకవేళ మినిట్స్ తప్పుయితే మరుసటి రోజే ఎందుకు ప్రెస్‌మీట్ పెట్టి ఖండించలేదు. 19న మినిట్స్ బయటకొస్తే 20న లేదా 21న లేఖ ఎందుకు రాయలేదు. సకాలంలో మీరు లేఖ రాయలేదంటే ప్రాజెక్టులపై మీ నిర్లక్ష్యం ఎలా ఉందో అర్థమైతున్నది. లేఖ రాయలేదంటే ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించేందుకు ఒప్పుకొన్నట్టే కదా?

ఆ రెండూ తొలగిస్తే సంపూర్ణ మద్దతు

హరీశ్‌రావు: మీరు పెట్టిన తీర్మానానికి సంపూర్ణ మద్దతు తెలియజేస్తాం. కానీ మీరు రెండు సమావేశాల్లో ప్రాజెక్టులను అప్పగిస్తామని తొందరపాటున ఒప్పుకొన్నామని, తప్పయిందని క్షమాపణ కోరండి. క్షమాపణ చెప్తే హుందాతనంగా ఉంటుంది. కాంగ్రెస్ ప్రభుత్వం రెండు మీటింగ్‌ల ద్వారా ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించిందనేది ప్రజలకు అర్థమైంది. ఈ తీర్మానంలో రెండు అంశాలపై అభ్యంతరం ఉన్నది. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నీటి కేటాయింపులు 299:512 అంశంలో అన్యాయం చేసిందని, కేఆర్ఎంబీ అంశాన్ని తొలగించాలి. ఇక ఈ తీర్మానంలోని డిమాండ్లన్నీ కూడా గతంలో తాము పెట్టిన డిమాండ్లే. అనేక మార్లు మేం కేంద్రం ముందు పెట్టాం. ఇవేవీ కొత్తవేమి కావు.

ఉత్తమ్: హరీశ్‌రావు, కేసీఆర్ ఇరిగేషన్ శాఖలో లక్షల కోట్ల కాంట్రాక్టులు అప్పజెప్పి.. తెలంగాణకు నీటి కేటాయింపుల్లో అన్యాయం చేసి ఇప్పుడు మాట్లాడటం దారుణం. తెలంగాణకు 299 టీఎంసీల నీళ్లు ఎవరు ఒప్పుకొన్నారు? లక్ష కోట్లతో కాళేశ్వరం కట్టిన తర్వాత కూలిపోయింది ఎవరి హయాంలో? జగన్మోహన్‌రెడ్డి ఎవరితో ఒప్పందం చేసుకొని కృష్ణా జలాలపై రాయలసీమ ప్రాజెక్టును కట్టారు? కేసీఆర్ క్షమాపణ చెప్పేవరకు బీఆర్ఎస్‌లో ఎవరూ మాట్లాడొద్దు.

హరీశ్‌రావు: గత బీఆర్ఎస్ ప్రభుత్వం నీటి పంపకాన్ని 299:512కు ఒప్పుకొని రాష్ట్రానికి శాశ్వతంగా అన్యాయం చేసిందని మంత్రి ఉత్తమ్ పదే పదే చెప్తున్నారు. అయితే మినిట్స్‌లోని వాస్తవాలను చెప్పదలుచుకున్నాను. ఇది తాత్కాలికమైన ఒప్పందం మాత్రమేనని, భవిష్యత్తులో జరిగే ఒప్పందాలకు దీనికి సంబంధం లేదని మినిట్స్‌లో స్పష్టంగా పేర్కొన్నారు. 299 టీఎంసీలకు ఆద్యులే కాంగ్రెస్ పార్టీ. వారు చేసిన దుర్మార్గం, తప్పిదం వల్లే దీనికి ఒప్పుకోవాల్సి వచ్చింది. నీటి కేటాయింపులు 50:50 కావాలని మేం అడగలేదని చెప్తున్నారు. దీనికోసం 27 లేఖలు రాశాం. 2021 మే 24న రాసిన లేఖలోనూ పేర్కొన్నాం. పాపం కాంగ్రెస్ పార్టీ పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుకలా తయారయ్యింది. స్మితా సబర్వాల్ లేఖను సగమే రాశారు. ఆ తర్వాత అపరేషన్ ప్రొటోకాల్ పూర్తికాకుండా అప్పగించలేమని పేర్కొన్నారు. ఇదే విషయాన్ని రాహుల్ బొజ్జా కూడా చెప్పారు. ఇలా ఆఫీసర్ల మీద నిందలేసుకుంటా ఎంతకాలం పని చేస్తారు.

ప్రాజెక్టులు అప్పగించినట్టు ఈఎన్సీలే చెప్పారు

హరీశ్‌రావు: ఫిబ్రవరి 1న కేఆర్ఎంబీ రెండో సమావేశం జరిగింది. ఈ మీటింగ్‌లో మళ్లీ ప్రాజెక్టును బోర్డుకు అప్పగిస్తామని చెప్పారు. దీంతోపాటు ప్రాజెక్టుల నిర్వహణకు అవసరమైన ఉద్యోగులను వారం రోజుల్లో కేటాయిస్తామని, వారికి వేతనాలను తమ ప్రభుత్వాలే చెల్లిస్తాయని ఒప్పుకొన్నారు. ఈ మీటింగ్ తర్వాత రెండు రాష్ట్రాల ఈఎన్సీలు నారాయణరెడ్డి, మురళీధర్‌రావు బయటికొచ్చి ప్రాజెక్టుల ఆపరేటింగ్‌ను అప్పగిస్తామని ఒప్పుకొన్నారు. ఇందుకు వీడియోనే సాక్ష్యం.

ఉత్తమ్: చిల్లర రాజకీయాలు చేస్తున్నారు. ఇరిగేషన్ మంత్రిగా నేను, సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రాజెక్టులను అప్పగించలేదని చెప్తుంటే ఆ ఇంజనీర్ ఇలా అన్నారు.. అటెండర్ అలా అన్నారు అంటే ఎలా? కామన్‌సెన్స్ లేకుండా మాట్లాడుతున్నారు.

హరీశ్‌రావు: ఉత్తమన్న ఫ్రస్టేషన్‌ను నేను అర్థం చేసుకుంటా. ఆయన పుట్టు కాంగ్రెస్ వాది. ఆరేడుసార్లు గెలిచి ముఖ్యమంత్రి కాక పోతిననే రంది ఉన్నది.

ఉత్తమ్: ఇవన్నీ ఫాల్స్ అలిగేషన్స్. ఆ చిల్లర మాటలెందుకు. ఎక్కడి నుంచో తెచ్చిన కాగితాలు పట్టుకొని మాట్లాడుతూ... గ్రామ పంచాయతీలా చేస్తున్నారు.

హరీశ్‌రావు: ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి గ్రామ పంచాయతీలంటే అంత చులకనా? గ్రామ పంచాయతీల్లో మంచి చర్చలు జరగవా? నేను తెచ్చిన పత్రాలన్నీ కేంద్ర ప్రభుత్వం విడుదల చేసినవే.

భట్టికి గట్టి సమాధానం



భట్టి: రిటైర్డ్ అయిన మురళీధర్‌రావును బీఆర్ఎస్ ప్రభుత్వం దశాబ్ద కాలంపాటు ఈఎన్సీగా కొనసాగించుకొని వారికి ఎలా కావాలో అలా చేసే వ్యక్తిగా ఆయన్ను నడిపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఈఎన్సీ మురళీధర్‌రావు ప్రభుత్వ ఆదేశాల కన్నా ఎక్కువగా బీఆర్ఎస్ పార్టీ మాటలు విన్నారు. ఆయన్ను వెనక నుంచి నడిపించి ఆయనతో వ్యతిరేక మాటలు చెప్పించి, తెలంగాణకు నష్టం జరిగేటట్టు చేసి దాన్ని సభలో చూపిస్తున్నారు. ఆయనను తట్టాబుట్టా సర్దేసి ఇంటికి పంపించాం. ఇంకా చాలా మంది ఉన్నారు. మీ ఏజెంట్లు. వాళ్లం దరి సంగతి కూడా చూస్తాం.

హరీశ్‌రావు: మొత్తానికి వాళ్ల తప్పిదాన్ని ఓ అధికారిపైకి నెట్టేసి.. వారిని వారు కాపాడుకొనే ప్రయత్నం చేస్తున్నారు. ఒకవేళ ఈఎన్సీ మాట్లాడింది తప్పయితే ఆయన మాట్లాడిన మరుసటి రోజే మంత్రో లేక మరెవరో ఖండించాలి. కానీ అప్పుడు ఖండించకుండా ఈరోజు వాస్తవాలు బయటపెడితే వాటిని అధికారిపైకి నెట్టేసి తప్పించుకొనే ప్రయత్నం చేస్తున్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత జరిగిన మొదటి మీటింగ్, రెండో మీటింగ్ మినిట్స్‌ను చూపించాను. కార్యదర్శి రాహుల్ బొజ్జా రాసిన లేఖను చూపించాను. వీడియోను కూడా చూపించాను. అప్పుడు మీరు మేల్కొన్నారు.

భట్టి విక్రమార్క: కృష్ణా జలాలపై ప్రభుత్వం పెట్టిన తీర్మానానికి మద్దతు ఇస్తారా? లేదా?

హరీశ్‌రావు: ఒకే విషయం ఖుల్లం ఖుల్ల. మొన్న ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ఈ రోజు చర్చను పక్కన పెట్టి తీర్మానాన్ని ప్రవేశపెట్టారంటే అది నల్లగొండ సభ పుణ్యమే. కేసీఆర్ గొంతు విప్పడం వల్లే. ఇది బీఆర్ఎస్ పార్టీ సాధించిన విజయం. ఇక క్షమాపణ చెప్పాల్సింది కాంగ్రెస్ పార్టీనే. చేసిన తప్పును క్షమించాలని కోరి తీర్మానం పెట్టినందుకు సంతోషం. తీర్మానంలో గత ప్రభుత్వం అనే పదాన్ని తీసేస్తే సంపూర్ణంగా మద్దతు తెలుపుతాం.

రాహుల్‌గాంధీని కూడా చెప్పతో కొట్టినట్టేనా?

> నల్లగొండలో 11 సీట్లలో బీఆర్ఎస్‌ను ఓడించిన ప్రజలు చెప్పతో కొట్టారంటూ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఘాటుగా స్పందించారు. అలా అయితే అమేథీలో ఓడిపోయిన రాహుల్‌గాంధీని కూడా అక్కడి ప్రజలు చెప్పతో కొట్టినట్టేనా? అని ప్రశ్నించారు.

కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి భేషరతుగా క్షమాపణ చెప్పాలని, లేదంటే ఆయన వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని స్పీకర్‌ను డిమాండ్ చేశారు. అప్పటి వరకూ తాను మాట్లాడబోనని స్పష్టం చేశారు. తెలంగాణ తెచ్చిన వ్యక్తిని, పదేండ్లపాటు సీఎంగా చేసిన వ్యక్తిని పట్టుకొని అలాంటి నీచమైన భాష మాట్లాడటం తగదని అన్నారు. దీంతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తున్నట్టు స్పీకర్ ప్రకటించారు.

తుమ్మలకు దీటైన జవాబు

తుమ్మల: ఐదేండ్లుగా రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ 92 వేల క్యూసెక్కులకు పనులు జరుగుతున్నా మాట్లాడలేదు. మన దగ్గర మీటింగ్ జరిగిన తర్వాతే వారు టెండర్లు పిలిచి పనులు చేపట్టారు. ఐదేండ్లలో ముచ్చుమర్రి ప్రాజెక్టు పనులు జరిగాయి. కృష్ణా జలాలు పోతుంటే మాట్లాడకుండా గోదావరి జలాలకు ఒప్పుకొన్నామన డంలో అర్థంలేదు. తెలంగాణ నీళ్లకోసమే పుట్టింది కాబట్టి ఆ నీళ్లను సమర్థవంతంగా ఉపయోగించుకోవాల్సి ఉన్నది.

హరీశ్‌రావు: రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ జీవో 2020 మే 5న వచ్చింది. ఆ జీవో రావడానికి ముందే పత్రికల్లో వచ్చిన వార్తలతో అప్రమత్తమై ఆ ప్రాజెక్టును ఆపాలని 2020 జనవరి 20న కేంద్రానికి, కేఆర్ఎంబీకి లేఖ రాశాం. అనంతరం రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్‌ను ఆపేందుకు అనేక ప్రయత్నాలు చేశాం. జీఓ విడుదలైన వారంలోనే ప్రాజెక్టులను ఆపాలని 2020 మే 12న కేఆర్ఎంబీ చైర్మన్‌కు లేఖ రాశాం. అక్రమ ప్రాజెక్టును ఆపాలని కేంద్రమంత్రి షెకావత్‌కు 2020 అక్టోబర్ 2న కేసీఆర్ లేఖ రాశారు.

ప్రాజెక్టులు అప్పగించి నానా తంటాలు: హరీశ్‌రావు

కాంగ్రెస్ సర్కారు ప్రాజెక్టులు అప్పగిస్తామని చెప్పి సంతకాలు పెట్టి ఇప్పుడు నానా తంటాలు పడుతున్నదని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. 2005 డిసెంబర్ 19న పోతిరెడ్డిపాడు ప్రాజెక్టును 44వేల క్యూసెక్కులకు పెంచిననాడు మీరంతా ఎందుకు నోరు మూసుకున్నారని ప్రశ్నించారు. ఆరోజు పోతిరెడ్డిపాడు కోసం పేగులు తెగేదాకా కొట్లాడింది తామేనని, 40 రోజులు సభను స్తంభింపజేసినట్టు గుర్తుచేశారు. ఆనాడు సభలో సభ్యులుగా ఉన్నవారే నేడు మంత్రులుగా ఉన్నారని, ఆనాడు ఎవ్వరూ పెదవి విప్పలేదని దుయ్యబట్టారు. రాయలసీమ లిఫ్ట్ విషయంలో కూడా గ్రీన్ ట్రిబ్యునల్ నుంచి స్టే ఆర్డర్ వచ్చే వరకు వెంట పడ్డామని, కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదులు చేసినట్టు తెలిపారు. అపోహలు సృష్టించి సభను తప్పుదోవ పట్టించవద్దని కోరారు. ఆరు నెలల గడువులోగా సమస్య పరిష్కారానికి కృషిచేయాలనే అంశాన్ని తీర్మానంలో పొందుపర్చాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

కేసీఆర్ ఒక్కడిగా బయల్దేరి పోరాడిండు

మాజీ సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి పాపాల భైరవుడు అంటూ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై హరీశ్‌రావు దీటుగా సమాధానం ఇచ్చారు. 'ఇది గాంధీభవన్ మీటింగ్ కాదు. సీఎం మాట్లాడిన మాటల్ని రికార్డుల నుంచి తొలగించాలి. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కొంత మంది తూలనాడుతున్నారు. ఉద్యమం అప్పటి నుంచి కూడా చాలా మంది సమైక్యవాదులు, వారి అడుగులకు మడుగులొత్తే వాళ్లు ఆయన్ను దూషించే ప్రయత్నం చేశారు. ఇవాళ కేసీఆర్ లేకపోతే తెలంగాణ రాష్ట్రం లేదు. ఈ రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఇక్కడ కూర్చునే అవకాశం లేదు. కేసీఆర్‌ను నిందిస్తే ప్రజలే బాధపడుతున్నారు. చాలా మంది మాకు ఫోన్ చేసి 'సీఎం రేవంత్‌రెడ్డి భాష బాగా లేదని ఆవేదన వ్యక్తం చేశారు'. తెలంగాణకు అవమానం జరిగితే తనకు అవమానం జరిగిందని భావించిన కేసీఆర్ ఒక్కడిగా బయల్దేరి పోరాడిండు. ఎదురొడ్డి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిండు. పరిపాలనే చేతకాదని, తెలంగాణ చీకటవుతుందని, వ్యవసాయం చేయరాదని, నక్సలైట్ల రాజ్యమొస్తుందని శపిస్తే సుపరిపాలన అందించి, 3 కోట్ల టన్నుల ధాన్యం ఉత్పత్తి చేయించి రాష్ట్రాన్ని దేశానికి అన్నపూర్ణగా నిలిపారు' అని పేర్కొన్నారు.

ఉత్తమ్‌కు కడియం కౌంటర్

ఉత్తమ్: బచావత్ ట్రిబ్యునల్ ఉమ్మడి ఏపీకి 811 టీఎంసీలు కేటాయించింది. ప్రాజెక్టుల వారీగా కేటాయించలేదు. కానీ తెలంగాణ వచ్చిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం 299 టీఎంసీలకు అంగీకరించింది.

కడియం శ్రీహరి: ఉమ్మడి ఏపీలో మేజర్ ఇరిగేషన్ మినిస్టర్‌గా పనిచేసిన అనుభవం ప్రకారం చెప్తున్నా. బచావత్ అవార్డులో ఏపీకి ఎన్‌బ్లాక్ 811 టీఎంసీలు కేటాయించినప్పటికీ ఫైనల్ ఆర్డర్‌లో ప్రాజెక్టులవారీగా కూడా కేటాయించారు. 811 టీఎంసీల్లో ఏపీలో ప్రాజెక్టులవారీగా ఎంత వినియోగం ఉన్నది? తెలంగాణలో ఎంత ఉందో లెక్కతీసి దీని ఆధారంగా ఏపీకి 512, తెలంగాణకు 299 కేటాయించారు. ఇది కేవలం వినియోగం ఆధారంగా చేసింది మాత్రమే. నీటి పంపకాల ఆధారంగా చేయలేదు. దీన్ని పట్టుకొని 299 టీఎంసీలు అంటూ రాద్ధాంతం చేస్తున్నారు.

కేంద్రం వద్దకు కేసీఆర్ స్వయంగా వెళ్లి..

పదేండ్లలో ఎంతో కష్టపడి ట్రిబ్యునల్‌ను తెచ్చుకున్నాం. 2014 జూన్ 2న రాష్ట్రం ఏర్పడితే 2014 జూలై 14న అప్పటి సీఎం కేసీఆర్ స్వయంగా కేంద్రం వద్దకు వెళ్లి కృష్ణా నదీ జలాలను పునఃపంపిణీ చేయాలని, సెక్షన్-3 ప్రకారం ఇది తమ రాష్ట్రహక్కు అని లేఖ ఇచ్చారు. కేంద్రం ఏడాదిన్నర అయినా పట్టించుకోకుంటే పార్లమెంటు చట్టం ప్రకారం మేం సుప్రీంకోర్టును ఆశ్రయించాం. రెండో అపెక్స్ కమిటీ మీటింగ్‌లో సైతం కేసీఆర్ గట్టిగా వాదించారు. సుప్రీం కోర్టు కేసు వాపస్ తీసుకుంటే ట్రిబ్యునల్‌కు రెఫర్ చేస్తామని కేంద్రం హామీ ఇచ్చింది. దీంతో కేసును ఉపసంహరించుకొని సెక్షన్-3ప్రకారం మళ్లీ కేంద్రం వద్ద పిటిషన్ పెట్టాం. కృష్ణా జలాల్లో ప్రాజక్టులవారీగా నీటి కేటాయింపులు చేయాలని అనేక లేఖలు రాశాం. ఎనిమిది-తొమ్మిదేండ్ల నిరంతర ప్రయత్నాల తర్వాత 2023 అక్టోబర్ 6న కేంద్ర ప్రభుత్వం ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేస్తూ గెజిట్‌ను పబ్లిష్ చేసింది. 811 టీఎంసీలను ప్రాజెక్టులవారీగా పంపిణీ చేసేందుకు ట్రిబ్యునల్‌ను కేంద్రం ఏర్పాటు చేసింది. బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ 2004లో ప్రారంభమైతే ఇప్పటికీ కొనసాగుతున్నది. ట్రిబ్యునల్ ద్వారా ఆరు నెలల గడువులోగా నీటి కేటాయింపులు పూర్తిచేయాలని తీర్మానంలో పెట్టాలని హరీశ్‌రావు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా మెరుగైన వాదనలు వినిపిస్తే నీటి కేటాయింపులు పెరిగే అవకాశం ఉన్నది. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్‌పై కూడా స్వీపింగ్ రిమార్క్స్ చేశారు.

ఏపీ వాడుకొన్నది గోదావరి జలాలే: హరీశ్‌రావు

ప్రాణాలు పోయినా ఫర్వాలేదు కానీ తెలంగాణ ప్రయోజనాలకు ఎలాంటి నష్టం జరగనియ్యబోనని తెగించి కొట్లాడిన వ్యక్తి కేసీఆర్ అని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఏటా 2000 టీఎంసీలు సముద్రంలో కలుస్తున్నాయని, సముద్రంలో కలుస్తున్న గోదావరి నీటిని తీసుకునేందుకు సహకరిస్తామని మాత్రమే ఏపీకి కేసీఆర్ చెప్పారని గుర్తుచేశారు. ఇందులో మన రాష్ట్ర ప్రయోజనం కూడా ఉన్నదని, వారు గోదావరి నీటిని తీసుకుంటే కృష్ణా నీటిలో మనం నల్లగొండ, మహబూబ్‌నగర్‌కు, సాగర్‌కు ఎక్కువగా తెచ్చుకునే అవకాశం ఉంటదనే ఉద్దేశంతోనే వారికి సముద్రంలో కలిసే నీటిని వాడుకునే అవకాశం ఇచ్చామని స్పష్టం చేశారు.

అసెంబ్లీలో హరీశ్ అష్టావధానం

- సీఎం రేవంత్ సహా 8 మంది మంత్రులకు హరీశ్ సమాధానం
- అధికారపక్షానికి దడ
- గుక్కతిప్పుకోకుండా సమగ్ర వివరణ
- అదే వేగంతో ప్రభుత్వంపై ప్రశ్నలు
- సమాధానాలు వెతుక్కున్న మంత్రులు
- నష్ట నివారణకు పడరానిపాట్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): తెలంగాణ శాసనసభలో సోమవారం అరుదైన దృశ్యం ఆవిష్కృతమైంది. ప్రతిపక్ష పార్టీ తరపున శాసనసభలో కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డ్(కేఆర్ఎంబీ) తీర్మానంపై జరిగిన చర్చలో బీఆర్ఎస్ తరపున మాట్లాడిన మాజీ మంత్రి హరీశ్‌రావు అధికారపక్షాన్ని అల్లాడించారు. సీఎం సహా 8మంది మంత్రులకు సమాధానమిచ్చి అష్టావధానిగా అనిపించుకున్నారు. ఆయన సమాధానాలతో ఆత్మరక్షణలో పడిపోయిన అధికారపక్షానికి ఏం చేయాలో అర్థంకాక చివరికి కామెంట్లు మొదలుపెట్టింది. వాటికి కూడా హరీశ్ దీటుగా సమాధానమిచ్చారు. అసెంబ్లీ సమావేశాల లైవ్ చూస్తున్నవారు హరీశ్ మాట్లాడుతుంటే కదలకుండా వీక్షించారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు జరిగిన అన్యాయం గురించి చెప్తూనే తన ప్రసంగానికి అడ్డువచ్చిన వాళ్లను కూడా తూర్పారబట్టారు.

పంచ్ డైలాగులతో సమాధానాలు

సభలో హరీశ్‌రావు మాట్లాడుతూ పంచ్ డైలాగులతో అధికార పక్షాన్ని ఉక్కిరిబిక్కిరి చేశారు. ''ప్రభుత్వం కేఆర్ఎంబీ గురించి చెప్తూ రూపొందించిన పుస్తకానికి అవాస్తవాల పుస్తకం అని పేరు పెట్టండి. మేం మీలా ప్రిపేర్ కాకుండా రాలేదు. మంచిగ ప్రిపేర్ అయి వచ్చినం. మీరు అడిగిన ప్రతీదానికి ఆన్సర్ చేస్తాం', 'స్పీకర్‌గారూ.. ఇప్పుడు రేవంత్‌రెడ్డిగారు కూడా తెలంగాణ ఉద్యమం గురించి, తెలంగాణ గురించి మాట్లాడడం అ